
# అభిమానం




ఎమ్. ఉమామహేశ్వరరావు

**పాపాయి ...**

అందంగా, బొద్దుగా, ముద్దుగా ఉంది. చిదిమితే పాలు కారే బుగ్గలు—తెల్లటి పాల నురుగు వంటి తెలుపు. బోసి నోరు చాపి ఆబగా పాలడబ్బా కోసం మోకాళ్ళు వంచి ప్రాకుకుంటూ కదులుతోంది.

"అబ్బ! ఎంత ముద్దొస్తోం దీ పాపాయి!"

తనివి తీరని తమకంతో అమూల్ డబ్బా మీద ఆ పాపాయి బొమ్మను హృదయానికి హత్తుకొని పరవశించిపోయింది శారద. ఆమెలో ప్రతి అణువూ తీయని పారవశ్యం, ఏదో హాయి, ఇంకేదో తృప్తి. బొద్దుగా ఉన్న పాపాయి బుల్లి పాదాలతో ఎత్తైన తన గుండె మీద తన్నుతున్నట్లుగా, ఎత్తుగా ఉన్న తన రొమ్ములను బోసి నోటితో స్పృశిస్తున్నట్లుగా అనుభూతి. ఆమెలో ఎంతో ఆవేశం. క్షణంలోనే ఆమె కనుకొలకుల్లోంచి టపా టపా రాలి క్రింద పడ్డాయి కన్నీటి బాష్పాలు.

వివాహం జరిగి ఆరు సంవత్సరా లయినా శారద కడుపు పండలేదు. ఆమె భర రంగారావు ఒక ప్రయివేటు ఫర్మ్‌లో నెలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నాడు. దేనికీ లోటు లేదు. ఆప్యాయతానురాగాలూ, సిరిసంపదలూ అన్నీ పుష్కలంగా ఉన్నాయి. కాని స్త్రీకి మాతృత్వం ఒక వరం. ఆ వరం పొందలేని ఆమె కీ జీవితం వ్యర్థంగా అగుపించసాగింది.

శారద చాలా సెన్సిటివ్. ఆమెలో ప్రతిక్షణం రగిలే ఆ కోర్కె దావానలంలా దహించేసి ఆమెకూ, భర్తకూ మధ్య ఎంతో బాధను కలిగిస్తుంటుంది. శారదకు పిల్లల్లేరన్న విషయం బంధువుల్లో వ్యాపించింది. అప్పుడప్పుడు భర్తతోపాటుగా తెలిసిన బంధువుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు వాళ్ళు కురిపించే జాలీ, కనికరంతో శారద మూడొంతులు చచ్చిపోయేది. ఎందరో స్పెషలిస్టుల్ని చూసినా ఫలితం లేకపోయింది. ఆమెలో ఏ లోపమూ లేదు. రంగారావూ పరీక్ష చేయించుకున్నాడు. అతనిలోనూ లోపం లేదు.

"మీకు పిల్లలు కలగాలంటే అదేదో మాజిక్‌లా పుట్టాల్సిందే తప్ప మీ ఇద్దరిలోనూ ఏ లోపం లేదండీ!" డాక్టరు చెప్పినప్పుడు అయోమయంగా నవ్వేశా రిద్దరూ.

ఆలోచనల్లో ఉండగానే ఉన్నట్లుండి ప్రక్క పోర్షన్‌లోంచి ఏడుపూ, పిల్లల్ని బాదుతున్న చప్పుడూ, పిల్లల ఏడుపూ వినిపించేయి. ఆలోచనలను ఆపి ప్రక్క పోర్షన్ గోడ దగ్గరే ఉన్న కిటికీ తలుపు తెరిచింది శారద.

ఆ ప్రక్క పోర్షన్ జానికమ్మది ...

"మాయదారి సంత. ఆ దేవుడికి బుద్ధీ, జ్ఞానం అస లేమైనా ఉంటేనా? ఇంత మంది యములాళ్ళను నా కడుపున పడేసి ఇరవై నాలుగ్గంటలూ నన్నే దవ మంటున్నాడు. ఒక్క వెధవా చెప్పినట్లు వినడు. ఛీ... ఛీ ... వెధవ బ్రతుకు. క్షణం సుఖం లేకుండా పోయిం దీ బ్రతుక్కి. ఒకళ్ళా, ఇద్దరా! ఆరుగు రున్నారు ముండ. గొర్రెల్లా పీకల్దాకా

మెయ్యడం తప్పించి మరోటి రాదు వెధవలకి. ఎంతసేపూ అది కావాలీ, ఇది కావాలీ అంటూ పేగుల్ని కొరికి పారేస్తున్నారు. ఒక్కసారి చస్తే పీడా విరగడైపోను...''

జానికమ్మలో ఆక్రోశం కట్టలు తెంచుకుంది. దుఃఖం వల్ల గొంతు పూడుకుపోయి ఏడుపు బయటకు ఫ్రీగా రావడం లేదు.

జానికమ్మ భర్త కేశవరావు. నెలకు ఆరు వందల రూపాయలు తెచ్చుకుంటున్నా అతనికి లేని చెడు వ్యసనం అంటూ ఏదీ లేదు. జీతాల రోజు పీకల్దాకా త్రాగి వస్తాడు. ఆ జేబుల్లో పయాపైసా కూడా ఉండ దొక్కోసారి. జీతం తాగడంకోసం, పెళ్ళాం అనే శాల్తీ సుఖం కోసం అంటుంటాడు. ఆరుగురు పిల్లలకూ కడుపు నిండా ఇంత తిండి పెట్టగలిగిన నాడు ఆ రోజే వాళ్ళకు 'పండగ' రోజవుతుంది. భర్తమీద చిరాకూ, విసుగూ, కోపమూ పిల్లల మీదకు పోతుం దామెకు. వాళ్ళను బాదుతుంది. ఆ వెనక తనూ ఏడుస్తుంది.

కిటికీలోంచి చూస్తున్న శారద భుజం మీద బరువుగా చెయ్యి పడింది. ఉలిక్కిపడి చూసింది. ఎదురుగా భర్త రంగారావు.

''మనకు లేనిదాన్ని ప్రతి క్షణం గుర్తుకు తెచ్చుకోవడంలో ఆనందం కన్నా ఆవేదన ఎక్కువగా ఉంటుంది, శారదా. ఏ క్షణం నువ్వు ఆ కిటికీని తెరిచినా ఆలోపాలో మంటున్న వారి పిల్లలూ, వాళ్ళ ఏడుపు ముఖాలూ, ఆకలిరాగాలూ తప్పవుగదా! నీ కవి అన్నీ ఆనందం బదులుగా బాధను కలిగిస్తున్నాయి. అవునా?!''

ఒక నిమిషం పాటు ఆగి మళ్ళీ అన్నాడు రంగారావు. శారద ఇంకా ఆ మూడ్‌లోనే ఉంది. ''భగవంతుడు మనకు సర్వం ఇచ్చేడు, ఒక్క పిల్లల్నితప్ప. ప్రతిజీవికీ ఏదో ఒక లోటునో, లోపమో కలిగిస్తేనే తప్ప ఆయున్ని మనం తల్చుకునే దెట్లా? జీవితం మన చేతుల్లో ఎన్నడూ ఉండదు, శారదా...''

శారదలో దిగులు పోలేదు.

''నాకు బాగా ఆకలిగా ఉంది. నే చేత్తో ఇంత అన్నం తినిపించవా?''

గారాలుపోతూ అంటున్న భర్త రంగారావు చేష్టలకు పులకించిందామె తనువు. పకాపకా నవ్వేసింది. ఆ వెనక అతనూ నవ్వేశాడు ఏదో సాధించానన్న తృప్తితో.

శారద తెరిచి ఉంచిన అదే కిటికీలోంచి సంభాషణలూ, నవ్వులూ వినిపిస్తున్నాయి జానికమ్మకు. ఆమె హృదయం ఒక్కసారిగా ఏదో బాధతో చిరుక్కుమంది. ఆమె కళ్ళ ముందు తాను జీవితంలో కోల్పోతున్నదేమిటో స్పష్టంగా తెలిసింది. ఆ క్షణం లోనే భర్త కేశవరావు గుర్తొచ్చాడు. నిత్యం రాచి రంపాన పెడుతూ తనని శారీరక సుఖం తీర్చే యంత్రంలాగా అవసరంకోసం పనికొచ్చే వస్తువులాగా చూడ్డం తప్పించి, భార్యగా ఏ నాడూ రవ్వంత ప్రేమను చూపించిన పాపాన పోలేదు.

చుట్టూ అలుముకుంటున్న చీకట్ని గమనించి నిర్లిప్తంగా పూరుకుంది జానికమ్మ. జీవితం బొమ్మా బొరుసు అన్నా రందుకే, ఒకే నాణానికి. రెండు పక్కలా రెండే రెండు పోర్షనులు గల ఆ ఇంట్లో ఒక దాంట్లో శారద, మరో దాంట్లో జానికమ్మ ఉంటున్నారు.

• • • •

అందంగా, ఆహ్లాదంగా ఉన్న ఆ సాయంత్రం మార్కెట్ సెంటరు కళకళ్ళాడుతూంది. ఫుట్‌పాత్ మీద నించుని చూస్తున్నాడు రంగారావు. అతని కళ్ళకు పూసలవాళ్ళు కనిపించారు. వాళ్ళ నల్లటి పొట్టి శరీరల మీద పైనా, కిందా మర్మావయవాల మీద ఒక అరమీటరు సించని గుడ్డ ముక్క తప్పించి మిగతా శరీర భాగమంతా నల్లగా మెరుస్తూంది. కిళ్ళీ వల్ల గారబట్టిన నోట్లోంచి యాసగా, దురుసుకుడుగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ ముందు పరిచిన నల్లటి గోనెపట్టాం మీద పూసల దండలూ, చెంప పిన్నులూ, పిన్నీసులూ దువ్వెనలూ ఉన్నాయి. ఆ జంక్షన్‌లో ఆగే ప్రతి వ్యక్తి దృష్టి వాళ్ళమీద క్షణమో, అర క్షణమో పడక మానదు. వాళ్ళ దో ఆచారం. భాషకూ, ఆలోచనకూ అందని ఆచారం వాళ్ళది. పదేళ్ళు వచ్చేసరికే వాళ్ళ ఆడపిల్లలు సెక్సుతో బూతు బూతుగా మాటలు దొర్లించుకుంటారు. పన్నెండో ఏటనే పిల్లల్ని కనడం మొదలు పెడతారు. స్త్రీ పురుష భేదం కోసం కాళ్ళకు సిల్వర్ మట్టెలూ చేతులకు మట్టి గాజులూ జుత్తు కలియబోసి కట్టిన రంగు రంగుల రిబ్బన్లూ ఉంటాయి. రాత్రుళ్ళు ఫుట్‌పాత్‌ల మీదనే పడక. గోనెపట్టాలు కిందా పైనా కప్పుకుని పడుకుంటారు.

ఇదంతా చూస్తున్నాడు రంగారావు. ఇంతలో అతని చెవులకు ''ఏమండీ రంగారావుగారూ!'' అనే పిలుపు సోకింది. అటు తిరిగి చూశాడు. దగ్గరకు వస్తూ కనిపించాడు జానికమ్మ భర్త కేశవరావు.

''నమస్కారం రంగారావుగారూ.''

''నమస్కారం. నమస్కారం అండీ.'' రంగారావు బదులుగా అన్నాడు.

''మీరు నా కో చిన్న సహాయం చేయాలి. చిన్నదంటే చిన్నదే కాదనుకోండి. మరేం లేదు. మీ రో యాభై రూపాయ లుంటే ఇస్తారా? వచ్చే జీతాల్రోజున తప్పక ఇచ్చేస్తాను.''

రంగారావు వూహించని పరిణామం అది. 'పక్క పోర్షన్‌లోనేఉన్నా ఇంతవరకూ ఎన్నడూ ఏమీ అడగలేదతను. పైగా వ్యసనపరుడు. నిత్యమూ దరిద్రం వాళ్ళింట తాండవిస్తుంటుంది. ఇప్పుడీ యాభై ఇస్తే తిరిగి రావడం ఎలాగూ ఉండదు. పోనీ లేదని చెప్పేస్తేనో?'

అతని ఆలోచనలో ఉండగానే కేశవరావు అన్నాడు. ''మీ రేం సంశయించకండి సార్. మా పరిస్థితి మీకు తెలిసిందేకదా! పిల్లలు పస్తుల్తో. ఆకల్తో...'' చివరి మాటలు పలికే టప్పుడు కేశవరావు గొంతు గద్గదమైంది.

అతని కళ్ళలో కన్నీరు సుడులు తిరుగుతూ నేల రాలింది.

రంగారావు మరి ఆలోచించ లేదు. జేబులోంచి యాభై రూపాయలు తీసి కేశవరావు కిచ్చాడు. ''థాంక్స్!'' అంటూ కదిలాడు కేశవరావు.

• • • •

''ఏయ్! బాబూ?''


తల తిప్పి చూశాడు బాబు. ఎవళ్ళు కనిపించ లేదు.

''ఇటూ...ఇదిగో..,నేనూ...''

కిటికీ వేపు తల తిప్పిన బుజ్జి పాపాయికి కిటికీ లోంచి శారద నవ్వు ముఖంతో కనిపించింది. ఆమె చేతిలో ఒక బిస్కెట్ పాకెట్ ఉంది. ఆ పాకెట్‌ను చూడగానే చరచరా పాకుకుంటూ వచ్చాడు అందుకోవడానికి. ఈలోగా పెద్ద కుర్రవాడొకడు వచ్చి శారద చేతిలోని బిస్కెట్ పాకెట్ తీసుకుని పాపాయి చేతిలో పెట్టాడు.

మెరుస్తున్న కళ్ళతో అటువేపే చూస్తోంది శారద. పిల్లలందరూ ఆబగా ఆ బిస్కట్ పాకెట్ దగ్గిర మూగేశారు. లోపల్నుంచి జానికమ్మ వచ్చింది. బిస్కట్‌ల కోసం పిల్లలంతా మూగి కొట్లాడుకోవడం కనిపించింది. ఆమెలో ఆవేదన, పట్టరాని ఉక్రోషం కనిపించింది. శారద కిటికీ దగ్గర్నుంచి మెల్లగా ప్రక్కకు తప్పుకుంది ఆ దృశ్యాన్ని చూడ్డం ఇష్టంలేక.

ఆట్నుంచి జానికమ్మ గొంతు బిగ్గరగా వినిపించింది శారదకు.




''ఇదిగో...మిమ్మల్నే. అలా ఎవరో ఒకరిచ్చిన బిస్కట్లు అందుకుంటూ, తింటూన్నంతకాలం మీరెవరూ బాగుపడరు. అలా అందుకున్నారో మీ చర్మం ఒలిచేస్తాను, వెధవల్లారా! లేకపోతే పడి చచ్చినట్లుండాలి. అంతేగాని అలా పుచ్చుకోకూడదు. మీ నాన్న రానివ్వండి. మీ చర్మం ఒలిపించేస్తాను. ఒరేయ్, సీనూ! ఆ బిస్కట్ పాకెట్ తీసుకెళ్ళి ప్రక్క పోర్షన్‌లోని శారదగారికి ఇచ్చేయి!''

ఆ మాటలకు ఉలిక్కిపడింది శారద.

'ఏం పాపం చేశానని ఈ పరిస్థితుల్ని కల్పిస్తున్నావ్, భగవంతుడా?' కనిపించని ఆ భగవంతుడి ఫోటో ముందు దుఃఖంతో నించుంది శారద. 'ఆ పిల్లల ఆకలి గోల వినలేక బిస్కట్ పాకెట్ పంపడం తప్పా? నా చేత్తో పంపింది తింటే ఏమవుతుందో నన్న భయమా?'

అయోమయంగా రోదించసాగింది శారద.

"ఆంటీ!" వినిపించిందో కంఠం. తలెత్తి చూసింది. జానికమ్మగారి సీను కనిపించేడు.

"ఇది మీ కిచ్చేసి రమ్మంది అమ్మ." ఆ కుర్రాడి ముఖంలో ఏదో వెలితి. ధైర్యం, చురుకుదనం లేని బెంగ చూపులు. శారద గుండె తరుక్కుపోయింది.

"ఆంటీ...నిన్న రాత్రి మేమెవ్వరమూ అన్నాలు తిన్లేదు. చంటి తమ్ముళ్ళకే ఇంత అన్నం పెట్టింది. ఆకలితోనే నిద్రపోయేం. రాత్రి నాన్నగారు బాగా తాగేసి వచ్చేరు, ఆంటీ. అమ్మను తిట్టేరు. 'డబ్బులెక్కడివి? ఇంట్లో బియ్యం లేవు కదా? కొనుక్కురాలేకపోయారా?' అంది అమ్మ. నాన్నగారు ఏమీ జవాబు చెప్పలేదు. తెలివి లేకుండా పడుకుండిపోయారు." పదేళ్ళయినా పూర్తిగా లేని ఆ కుర్రాడి మస్తిష్కంలో ఇప్పుడే ఇటువంటి వూహలు. నిజ జీవితంలోని వాస్తవాలు అల్లరిపెట్టడం నిజంగా ఆ వయస్సు పిల్లలకో శాపం.

శారద జాలిగా చూస్తున్న సీనును పిలిచి హృదయానికి బలంగా హత్తుకోవాలనిపించింది. కాని ఏదో శంక. సంశయంతో ఆగిపోయింది.

• • •

ఆ మధ్యాహ్నం ఏదో పుస్తకం చదువుతూ అలా మంచంమీద పడుకుంది శారద. ప్రక్క పోర్షన్‌లోంచి జానికమ్మ ఆఖరు పిల్లాడి గొంతు వినిపించింది ఏడుస్తూ. కిటికీ తెరిచి చూసింది. నేలమీద ఒక్కడే పడి ఏడుస్తున్నాడు. లోపల గదిలో ఎవరూ ఉన్నట్లు లేదు. వీధిలో పెద్ద పిల్లలు ఆడుకుంటున్నారు. ఏడుస్తున్నవాణ్ణి ఎవళ్ళూ పట్టించుకోలేదు. ఏడుస్తున్న ఆ పిల్లాణ్ణి చూస్తుంటే శారద గుండె తరుక్కుపోయింది. అటు వేపు కదిలింది.

లోపల ఎవళ్ళూ లేరు. వెళ్తూనే ఆ కుర్రాణ్ణి తీసుకుని ఎత్తుకుంది. చేతిలో ఉన్న చాక్లెట్లు తీసి ఇచ్చింది. వాడూరుకున్నాడు. వాడలా ఏడవడం మానేసి శారదకేసి గుడ్లప్పగించి చూడసాగేడు. వాణ్ణి బలంగా గుండెకు అదుముకుంది శారద.

"శారదగారూ!..."అది జానికమ్మ కంఠం.

ఉలిక్కిపడింది శారద. భయంగా కుర్రాణ్ణి గుండెకు మరింత గట్టిగా హత్తుకుంది.

"బాబు గుక్కపెట్టి ఏడుస్తుంటే వచ్చి ఎత్తుకున్నానండీ!" మనస్సును చిక్కపెట్టుకుంటూ అంది శారద.

"చూడండి, శారదగారూ! ఇప్పుడు మీరు మా పిల్లలమీద చూపిస్తున్న దయకూ, కనికరానికీ మాకే ఎంతో ఇదిగా ఉందండీ! వాళ్ళు ఇలా ఏడుస్తున్నప్పుడల్లా బిస్కట్లూ, చాక్లెట్లూ తెచ్చి మీ రిస్తూ పోతుంటే రోజూ గాక ప్రతి నిమిషమూ వాళ్ళు అలా వాటికోసం ఏడుస్తూనే ఉంటారండి. ఇవాళ మీరు ఒక చాక్లెట్ ఇస్తారు. రేపూ ఏడిస్తే రేపూ ఇస్తారు. ఆ తరువాత కూడా ఇస్తారు. అలా ఇస్తూనే ఉంటారు. కాని...మీకు తెలీకపోవచ్చునండి. ఒక్క రోజు గాని మీరు మరిచిపోయో, లేకపోతే ఏ వూరు వెళ్ళో ఆ రోజు ఇవ్వకపోతే వీళ్ళు మా పేగుల్ని కొరికి నమిలి తినేస్తారండీ! అలవాటు చేసేముందే ఆలోచించాలి. ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మా బ్రతుకులు మూడు పూటలా ఇంత తిండి కోసం వెతుక్కోవడంతోటే తీరిపోతున్నాయి. దయచేసి ఈ అలవాట్లు చేసి మా పిల్లల్లో లేనిదానికోసం ఏడ్చే నైజం కల్పించవద్దని ప్రార్థిస్తున్నాను..."

అన్నవి చాలా తక్కువ మాటలైనా శారద మనసు చివుక్కుమన్నది. చంకలోని చంటాడు ఇంకా ఏడుస్తూనే ఉంటే వాడి వీపుమీద ఒకటి అంటించింది జానికమ్మ.

వాడు ఆగలేదు. మళ్ళీ కొట్టింది.

మళ్ళీ కొట్టింది. ఏడుపు పెరిగింది. ఇంకా అలా బాదుతూనే ఉంది జానికమ్మ, పసివాడి అరుపులు ఆగేదాకా.

అవమానంతో, బాధతో అక్కణ్ణుంచి తన పోర్షన్‌లోకి వచ్చేసింది శారద.

• • • •

"ఇది మీకు ధర్మంకాదు. రాత్రినుంచి చంటాడు మూసిన కన్ను తెరవలేదు. జ్వరం చాలా ఎక్కువగా ఉంది.

ఇవ్వాళన్నా డాక్టర్ని తీసుకొచ్చి చూపించండి."

భర్త నిర్లక్ష్యంగా, ఏమీ పట్టనట్టుగా వీధిలోకి వెళ్ళిపోతూంటే బతిమాలసాగింది జానికమ్మ. కేశవరావు భార్య మాటల్ని ఖాతరు చేయలేదు.

"జ్వరమేగా? సాయంత్రానికల్లా తగ్గిపోతుందిలే. జ్వరానికే ఏడిస్తే, ఇక పెద్ద పెద్ద జబ్బులు చేసేవాళ్ళు ఎంత ఇదిగా బెంగ పెట్టేసుకోవాలో ఆలోచించు. పైగా ఇప్పుడు నెలాఖరు—చేతిలో చిల్లి గవ్వ కూడా లేదు. జీతాలు అందేక చూసుకుందాంలే."

భర్త నిర్లక్ష్యానికి ఒళ్ళు మండింది జానికమ్మకు.

"మీ జీతాలు అంది, మీరు తాగేయగా, మిగిలిన డబ్బు తెచ్చి ఇచ్చే వరకూ జ్వరం అలానే ఉండాలంటారా?... వీళ్ళు మీ పిల్లలూ, మీ రక్తంతో పుట్టిన జీవులని మరచిపోతున్నారు గాబోలు ఎక్కడో ఏదో తంటాలు పడి ఇంతకాలం ఈదుకొస్తున్నా నీ సంసారాన్ని..." ఏడుస్తూ అంది.

"చూడు, జానికీ!... మంద ఎక్కువైపోయారని అలోపాలో మన్నావు. ఇప్పు డందులో ఒకడు పోతే పోనీలే. గాభరా పడిపోకు. ఇంకా అయిదుగురుంటారు."

ఈసడింపుగా చూసింది భర్తవేపు.

'మీ రిప్పు డో పని చేయాలి,' భర్తతో అంది శారద.

"ఏమిటది? లేచి అన్నాడు రంగారావు.

"ఏమీలేదండీ! అర్జంటుగా డాక్టర్ని పిల్చుకొచ్చి మందులు వేయకపోతే ఆ చంటాడు దక్కేలా లేడు. మనంతట మనం కలగజేసుకుంటే ఎటు పోయి ఏం వస్తుందోనని అనుమానంగా ఉంది. అయినా ఫరవాలేదు. ఆ కుర్రాడిని ఎలాగైనా బతికించుకోవాలి." ఆందోళనగా అంటున్న భార్యవేపు పరీక్షగా చూసేడు రంగారావు.

చొక్కా వేసుకుని పక్క పోర్షన్‌లోకి నడిచేడు.

కేశవరావు వీధిలోకి వచ్చేయడానికి కదులుతున్నాడు.

"మీతో ఒక విషయం మాట్లాడాలి, కేశవరావుగారూ! దయచేసి లోపలికి పదండి. ప్లీజ్" రంగారావు అలా అభ్యర్థిస్తుంటే కాదనలేక పోయాడు కేశవరావు. లోపలికి కదిలారు ఇద్దరూను.

"కేశవరావుగారూ! నే నిప్పుడు మిమ్మల్నీ, మీ పరిస్థితుల్నీ చూసి ఏదో చులకనగా లెక్క వేసి అనడం లేదు. మీతో కలిసి మీ పక్క పోర్షన్‌లో ఉంటున్నందుకు ఇంత పెద్ద ఇంటిలో ఇద్దరం చెరి సమాన పోర్షన్‌లో జీవిస్తున్నందుకు ఆ ధైర్యం చేసి అంటున్నాను. పక్క పక్కనుంటూ, ఒకరి కష్టాల్లో మరొకళ్ళు పాలు పంచుకోవడం ధర్మం. ఎవరి పిల్లలైనా ఒకటే కదా. ఇప్పుడా పసివాడికి వైద్యం చేయించేందుకు మీ రిద్దరూ పడుతున్న అవస్థ మాకు తెలియంది కాదు. చూస్తూ చూస్తూ పిల్లాణ్ణి అశ్రద్ధతో వదులుకుంటామా? నా మాట కాదనవద్దు. ఈ డబ్బుతో ముందా పసివాడికి వైద్యం చేయించండి. ఈ విధంగా చేయడంలో మా దంపతుల కదో మానసిక తృప్తి. ఆ పసివాడికి స్వస్థత కలుగుతుంది."

జేబులోంచి వంద రూపాయల నోటు తీసి కేశవరావు జేబులో ఉంచబోయాడు రంగారావు.

రంగారావుఅభ్యర్థన త్రోసిపుచ్చడానికేమీ కారణం కనిపించ లేదు కేశవరావుకు. ఆ వందా అందుకోబోయాడు. కాని అంతలోనే జానికమ్మ కంఠం ఖంగుమంది.

"అన్నయ్యగారూ!

రంగారావు ఆగిపోయాడు.

జానికమ్మ రెండు చేతులూ జోడించి అంది "మరేం అనుకోవద్దు. కడుపున పుట్టిన బిడ్డకు వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నా, ఎలాగోలా తంటాలు పడతాం. ఆ డబ్బు మీ దగ్గరే ఉంచండి. ఇప్పుడా డబ్బుతో మా చంటి వాడి నీరసం బాగుపడినా రేపొద్దున్న ఎట్నుంచి ఎలా వచ్చినా జీవితాంతం అదో నరకయాతనలా అనుభవించాల్సిందే."

ఏదో అనబోయాడు రంగారావు. కిటికీ లోంచి శారద చూస్తోంది సంఘటన అంతా. జానికమ్మ ఈ సారి భర్త కేశవరావు వేపు చూసింది. అతను మౌనంగా నించున్నాడు. ఆమె చేతిలో మంగళసూత్రాలున్న పుస్తెల తాడు ఉంది.

"ఇదిగోనండీ! ఇది తీసుకెళ్ళి ఎక్కడైనా తాకట్టు పెట్టండి. అది తెచ్చి మందులు కొని వెయ్యండి చంటాడికి. అంతేకాని ఇచ్చారు కదాని ఆ డబ్బు తీసుకుంటే ఆ తరవాత తీర్చుకోలేక అవస్థలు పడాలి. మన కున్న దాంట్లోనే ముందు నడుద్దాం. ఆ వెనక ఎలా జరిగేది అలానే జరుగుతుంది!" పుస్తెల్ని భర్త కేశవరావు చేతిలో ఉంచింది.

కేశవరావు స్థాణువులా నించుండి పోయాడు.

రంగారావు కేం చేయాలో తోచలేదు. కిటికీ లోంచి చూస్తున్న శారదకు మాత్రం జానికమ్మ అభిమానం హిమగిరిలా కనిపిస్తోంది. ★